కాకులు అరుస్తున్నాయి

పొట్లూరు సుబ్రహ్మణ్యం

ఇంటి ముందు కాకులు గోలగా అరుస్తున్నాయి. గుంపుగా చేరి ఏవో రహస్యాలు చెప్పుకొంటున్నట్లు ముక్కుకు ముక్కు ఆనించి మరీ అరుస్తున్నాయి. కాకి భాష మనుష్యులకు అర్థంకాదని కాబోలు పెద్దగా చెప్పుకొంటున్నాయేమో. ఇంటిముందు వరండాలో పిల్లలకు ట్యూషను చెబుతున్న

రాజారావుకు విసుగ్గా ఉంది. కాకిగోల అనుకొన్నాడు. వెళ్తాయేమోనని పాఠం ఆపి ఒక అయిదు నిముషాలు చూసాడు. కాని వాటిధ్యాస వాటిది. ఏమాత్రం ఖాతరు చేయకుండా కావుకావుమని అరుస్తూనే ఉన్నాయి. రాజారావు విద్యార్థులవైపు దృష్టిసారించాడు దాని భావం అర్థం అయినట్లుగా ఒక విద్యార్థి వెళ్ళి కాకుల్ని దూరంగా తరిమాడు. అవి ఎగిరి పోయాయి.

"సార్! ఇలా కాకులరిస్తే ఏదో అరిష్టం జరుగుందట. మా అమ్మమ్మ చెప్పింది" కాకుల్ని తరిమివచ్చిన విద్యార్థి వినయంగా చెప్పాడు, రాజారావు దగ్గర కొచ్చి.

"ఏడిసావ్. వెళ్ళి కూర్చో."

ఆ కుర్రవాడు ముఖం చిన్నబుచ్చుకొని వెళ్ళాడు. రాజారావు పుస్తకం తెరిచి పాఠం చెప్పబోతుండగా పరుగెత్తుకు వచ్చాడు మురళీ. వాడికి పదేళ్ళ వయిసుంటుంది. మనిషెందుకో వణకుతున్నాడు.

"మావయ్యా! మావయ్యా ప్రమాదం జరిగింది. మా అమ్మ బావిలో పడింది" అదుర్దాగా చెప్పాడు.

రాజారావు గుండె ఒక్కసారి ఆగి కొట్టుకోసాగింది "అయితే... అయితే.." అని మాత్రమే అనగలిగాడు. ఇంకేం మాట్లాడలేకపోయాడు.

"ప్రక్కింటి నాగభూషణం అన్నయ్య వాళ్ళు బావిలో దూకి అమ్మని తీసారు. ఇప్పుడు బయట మంచంమీద పడుకోబెట్టి నీళ్ళు కక్కిస్తున్నారు"

దాంతో రాజారావుకు కొంత ధైర్యం వచ్చింది, "ఇప్పుడేం ప్రమాదంలేదు కదా" అని అడిగాడు.

"మరేం ఫరవాలేదంటున్నా రంతా. డాక్టరుకోసం అన్నయ్య వెళ్ళాడు. మీకు చెప్పమని నన్ను పంపాడు" అయాసం తీర్చుకొంటున్నాడు మురళీ.

రాజారావు వెంటనే పిల్లల్ని ఆ రోజుకు వెళ్ళమని చెప్పి, ఇంట్లోకి వెళ్ళి భార్యకు విషయమంతా చెప్పాడు. ఆమె చేతిలోనిపని కూతుర్లకు ఒప్పజెప్పి హడావుడిగా బయలుదేరింది. ఇద్దరు దంపతులూ మురళిని వెంటబెట్టుకొని వాళ్ళింటికి బయలుదేరారు.

రాజారావు మనసంతా ఆలోచనలతో నిండిపోయింది. వసుంధర బావిలో ఎలా పడుతుంది! నీళ్ళు తోడుతూ తాడు జారి పడిందా. తాడు జారితే చేద బావిలో పడాలిగాని ఆమె ఎందుకు పడుతుంది. లేక గట్టుమీద ఎక్కి బాదంఆకులో మరేవయినా కోస్తుంటే కాలుజారిపడిందా? ఆలోచనలు తెగడం లేదు ఈ సందేహంతో.

ఆమెకు తాము బంధువులు కాకపోయినా ఆమె భర్త సత్యనారాయణ తన తోటి టీచరు. సహృదయుడు. అతని పత్నిగా వచ్చిన నాటినుండి వసుంధరను కూడా తన చెల్లెలుగా

స్వీకరించాడు రాజారావు. తన వయసును గౌరవించో లేక స్నేహానికి విలువనిచ్చో తన సలహా లేందే ముందుకు కదలరు. తనూ అంతే. తనకుటుంబ విషయాల్లోనూ వాళ్ళు జోక్యం చేసుకొంటూంటారు. అందుకే ఏ ఇబ్బందివచ్చినా ఒకరి కొకరు దిక్కు.

రాజారావు దంపతులు ఇంటికొచ్చే సరికి ఇంటిముందు జనం పల్చగా ఉన్నారు. ఇంతలో డాక్టరు వచ్చాడు. ఒక ఇంజెక్షనిచ్చి, ఏవో కొన్ని టాబ్లెట్లు వ్రాసిచ్చాడు. ఆమెకుబాగా గాలి తగలాలని, విశ్రాంతిని మించిన వైద్యం లేదని, భయపడవద్దని చెప్పి వెళ్ళిపోయాడు.

రాజారావు భార్య అక్కడే ఆ రోజంతా ఉండిపోవాలనుకొని పిల్లల్ని స్కూలుకు వెళ్ళమంది. రాజారావుకూడా ఆరోజుకు సెలవుపెట్టాడు. సత్యనారాయణ ఏదో ఊరికిపోవాలని రెండురోజులు సెలవు పెట్టాడు. అతనుంటే ఈ దుర్ఘటన జరిగేదికాదేమో అనుకొన్నాడురాజారావు.

వసుంధర తేరుకొన్న తరువాత అడిగాడు. "అమ్మా ఒంట్లో ఎలా ఉంది. సత్యనారాయణ ఊరునించి ఇంకా రాలేదా?"

ఆమె గుండెల్లోంచి దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది. చేతుల్లో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. రాజారావుకు పరిస్థితి ఏమీ అర్థంకాలేదు.

"సత్యనారాయణ కేమయింది?" అడిగాడు ఆదుర్దాగా.

"ఆయనకేం జరగలేదు. జరిగిన అన్యాయం నాకే" కళ్ళు తుడుచుకొంటూ చెప్పింది.

"ఏమిటమ్మా ఆదుర్దా. డాక్టరు ఫరవా లేదన్నాడుగా. అసలింతకూ ఎలాజరిగింది బావిగట్టుమీద నిలబడి ఏవైనా కోస్తూంటే కాలుజారిందా?"

"కాలు జారిపడలేదు అన్నయ్యా! నేనే చావాలని బావిలో దూకేసు. చావక పోవడం నా ఖర్మ" అంది ఏడుస్తూ. తరువాత క్రమేణా తన కడుపులోని బాధనంతా వెళ్ళగక్కింది.

"అన్నయ్యా! ఇంత జరిగిన తరువాత నేనెందుకు బ్రతకాలి. ఆయనంటే నాకెంత అభిమానమో నీకు తెలియంది కాదు" ముఖం దిండులో దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. ఈ విషయం విన్న తరువాత రాజారావు భార్యకుకూడా మనసు మొద్దుబారిపోయింది. ఇంత జరుగుతున్నా వసుంధర తన కెందుకు చెప్పలేదు. ఆడవాళ్ళు సిగ్గువిడచి ఇటు వంటి విషయాలు ఎవరికీ చెప్పుకోరేమో అనుకొన్నాడు రాజారావు.

సత్యనారాయణ స్కూల్లో తన తోటి టీచరు విమల వలలోపడి ఇంటికి రావడంలేదా. ఈ రెండురోజులుఎక్కడికో పోవాలని సెలవుపెట్టి విమల ఇంట్లో గడుపుతున్నాడా. రాజారావుకు కడుపులో

దేవినట్లయింది. ఆయనకు నమ్మబుద్ధి పుట్టడంలేదు.

"ఇవన్నీ నీ కెవరు చెప్పారమ్మా" అనడిగాడు లాలనగా.

"ఎవరు చెప్పడమేమిటి అన్నయ్యా ఇది చాలారోజులుగా జరుగుతుందట. ప్రక్కింటి పార్వతమ్మ, బాంకులో పని చేసే సత్యవతి 'మీ ఆయన ఎవరో అమ్మాయిని వెంటేసుకుని రోజూ పార్కుల్లో తిరుగుతుంటాడమ్మా, అని ఎప్పట్నుంచో చెబుతున్నారు కాని నేను నమ్మలా. అయితే ఈరోజు ఉదయం సత్యవతి మా ఇంటికివచ్చి, పసుందని సెలవు పెట్టి విజయవాడకు పోయాడని చెప్పావే మీ ఆయన, ఇప్పుడు హిందీ టిచరు విమల ఇంట్లో ఉండే చూసా'నని చెప్పింది. దాంతో మన మురళిని పంపాను. వాడు వీధివాకిట్లోంచి చూస్తే, ఆయన, విమల ఎదురెదురుగా కూర్చొని నవ్వుకొంటున్నారట. అంతే వాడు పరుగెత్తుకు వచ్చి నాకీ విషయం చెప్పాడు" ఏడవడం మొదలుపెట్టింది వసుంధర.

సత్యనారాయణ విశాల హృదయం తనకు తెలుసు. ఏ పరిస్థితుల్లో వసుంధరను చేసుకున్నాడో కూడా తెలుసు. తన స్వంతఊరు ఇదే కావడంతో వసుంధర కుటుంబం చరిత్ర తెలుసు. వసుంధర తల్లి వసుంధరకు పదేళ్ళప్రాయంలో ఇంకొకడితో లేచిపోయింది. వసుంధర తండ్రి మరల పెళ్ళి చేసుకోలేదు. వసుంధర యుక్తవయసు వచ్చేసరికి చాల అందగత్తెగా తయారయింది. ఆమె అందం చూసి యువకులు పెళ్ళిచూపులకు రావడం, లేచిపోయినదాని కూతురని తెలియగానే వెళ్ళిపోవడం జరుగుతూండేది. ఈ పరిస్థితిలో ఆ ఇంటి ప్రక్కనే గది అద్దెకు తీసుకొన్న సత్యనారాయణ మొదటి చూపులోనే ఆమెని ప్రేమించాడు. ఎంతమంది చెప్పినా వినక ఆమెనే చేసుకొన్నాడు. లోకుల కారుకూతలు విని భరించలేని భార్య కోసం అతను ఇష్టంలేకున్నా వేరేచోటుకు ట్రాన్స్‌ఫరు పెట్టుకొన్నాడు. అలా పన్నెండేళ్ళు ఊళ్ళుపట్టుకు తిరిగాడు. కాని ఈ లోపల వసుంధర తండ్రి మరణించడంతో మళ్ళీ ఇదే ఊరికి ట్రాన్స్ఫరు చేయించుకొని మామగారి ఇంట్లో ఉండవలసి వచ్చింది. ఒకప్పుడు కారుకూతలు కూసిన లోకం ఈనాడు భర్త, పిల్లలతో వచ్చిన వసుంధరను చూసి జోక మూడిచారు లోకం నైజం అంతే. భయపడిన వాళ్ళ వెంట తరుముతారు, ఎదురు తిరిగి నిలబడినవాడు వెంట తరిమినవారే వెనుక్కు తిరుగుతారు. అంతేకాక తమ రక్షణకోసం ఇంద్రుడు చంద్రుడు అని ముఖస్తుతి కూడా చేస్తారు. ఇప్పటి పరిస్థితి అదే.

ఇక హిందీ టిచరు విమల సంగతి. ఆమె చాల అందమైనది. నెమ్మదస్తురాలు. వివాహం కాలేదు. ఎప్పుడూ సమస్యల

వలయంలో చిక్కుకునట్లుంటుంది. సహజంగా కష్టాల్లో ఉండేవాళ్ళని ఓదార్చే అలవాటున్న సత్యనారాయణ ఆమెకు చేరువయ్యాడు. సత్యనారాయణ అంటే ఆమెకు అదొక రకమయిన అభిమాన మేర్పడింది. తన కడుపులోని దుఃఖాన్ని అతని దగ్గర వెళ్ళగక్కేది. దాంతో వసుంధర కష్టాల్ని ఆదుకోవడం తన విధి అనుకొన్నాడు సత్యనారాయణ. రెండు సంవత్సరాలనుంచి వాళ్ళస్నేహం అలా జరుగుతోంది. వాళ్ళ స్నేహంలో ఏ మాత్రమూ చెడు కనిపించలేదు తనకు.

అందుకే నిష్కల్మషంగా ఉండే సత్యనారాయణ, బేలగా కనిపించే విమల ఇంతగా తెగించారంటేనే బాధగానూ, కోపంగానూ ఉంది రాజారావుకి.

విమల ఇంట్లో కుర్చీలో కూర్చొని కాఫీ త్రాగుతున్న సత్యనారాయణ రాజారావును ఆహ్వానించి కూర్చోబెట్టాడు. విమల అయనకు నమస్కరించి చిరునవ్వుతో కాఫీగ్లాసు అందించింది. వాళ్ళ చర్యలకు కోపంతో ఉడికిపోతున్న రాజారావు, సత్యనారాయణ చెప్పింది విని అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకొన్న తరువాత, సత్యనారాయణ వ్యక్తిత్వం ముందు తాను గడ్డిపోచ ననుకొన్నాడు. విమల శిరస్సున చేయించి ఆశీర్వదించేంత వరకు ఆయన మనసు ఆగలేదు. సత్యనారాయణను విమలను చెడామడా నాలుగు చీవాట్లేసి బుద్ధిచెప్పాలని వచ్చిన రాజారావు తను అలాంటి ఆలోచనలు పెట్టుకొని విమల ఇంటికి వచ్చినందుకు ఇప్పుడు సిగ్గుపడుతున్నాడు. వసుంధర బావిలో దూకిన విషయం బయట పెట్టలేదు రాజారావు.

రాజారావు తిరిగివచ్చేసరికి వసుంధర మంచంమీద కూర్చొని ఎదురు కుర్చీలో కూర్చొని ఉన్న రాజారావు భార్యకు ఏదో చెబుతూ కళ్ళు తుడుచుకొంటోంది. వసుంధర ఈ మధ్య సమయంలో బాగా తేరుకొంది. రాజారావును చూసి ఇద్దరూ లేచి నిల్చున్నారు.

"అమ్మా వసుంధరా. త్వరగా బయలుదేరమ్మా మనం వెళ్ళాలి."

"ఎక్కడికి అంది వసుంధర ఏదో చేస్తాడని పంపిస్తే ఏదో చేసుకొనివచ్చాడన్నట్లు తనను ఎక్కడికో బయలుదేరమంటున్నాడు. అసలు విషయం చెప్పకుండా అనుకొంది.

"విమల ఇంటికి"

"దాని ఇంటికా" వసుంధర కళ్ళు తీక్షణంగా మారాయి. "అన్నయ్యా నువ్వేదో దాన్ని నాలుగు మాటలడిగి విషయం తేల్చుకోమంటే నన్నే దాని ఇంటికి రమ్మంటావా. నేను దాని ఇంటికి రాను. అవసరమయితే నా శవమే వస్తుంది అక్కడికి" గోడనానుకొని వెక్కి వెక్కి ఏడ్చింది వసుంధర.

అప్పటివరకు ఏమీ అర్థంకాక ప్రేక్షకురాలిలా చూస్తున్న రాజారావు భార్య

"ఛీ! ఏమిటమ్మా పాడు మాటలు...." అంటూ మందలించింది.

"అయితే వదినా. నా కింత అన్యాయం చేసిన దానిఇంటికి నన్నే రమ్మనడం ఏం న్యాయం. నువ్వే చెప్పు."

"వసుంధరా నా మాటవిను ఇందులో అవమానం పొందేది ఏమీలేదు. నువ్వు అక్కడికి రా. నామీద గౌరవంఉంటే నా మాట విను."

"నీ మాట ఎప్పుడు వినలేదు అన్నయ్యా. నా చిన్నతనంనుంచీ నన్ను నువ్వేరుగుదువు. మా మంచిచెడ్డల్లో, మాకష్టసుఖాల్లో మాకు అప్తుడివి, తండ్రివి అన్నీ నువ్వే కాని ఇట్లాంటి విషయాల్లో ఏ ఆడదీ తండ్రి మాట కాదుకదా దేవుడి మాటకూడా వినదు"

"నాకు తెలుసు వసుంధరా ఆడదాని మనసు. చూస్తూ చూస్తూ తన భర్తను ఇంకొకరికి అర్పించుకోలేదు. కాని ఈ ఒక్క విషయంలో నా మాట విని నాతోరా. అతనిది తప్పయితే నీముందే అతన్ని చీవాట్లేస్తాను."

"అంత బ్రతిమాలాల్సిన అవసరం లేదు అన్నయ్యా. నేనువస్తాను. అయితే ఆయన్ను నా ముందు తిట్టకండి. ఎంత తప్పుచేసినా ఆయన నా భర్త నా ముందు ఆయన్ను మందలించడంవల్ల నాకు గౌరవం ఏముంటుంది."

రాజారావు నవ్వుకొన్నాడు. ఇంత తెలివిగలది, భర్తమీద ఇంత ప్రేమగలది నిజంతెలిస్తే ఏమవుతుందోఅనుకొన్నాడు.

"సరే ఇక బయలుదేరు. మీ వదిన ఇంట్లో ఉంటుందిలే" అన్నాడు. వసుంధర తల సరిచేసుకొని. చీర మార్చుకొని ఏదో నిశ్చయానికి వచ్చినదానిలా బయలు దేరింది.

విమల ఇంటిముందు రిక్షాలు దిగే సరికి, విమల వీళ్ళకోసమే ఎదురు చూస్తున్నట్లుగా బయట గుమ్మందగ్గరే నిలబడి ఉంది. సన్నగా, నాజూగ్గా, పొడవుగా ఉంది. తెల్లని శరీరచ్ఛాయ. విశాలమైన కళ్ళు, కోటేరులాంటి ముక్కు రెండు చేతులకు నిండుగా సాదాగాజులు. వాయిల్ చీర, కాటన్ జాకెట్టు ధరించి ఉంది. వసుంధర చూపులు త్రిప్పుకోలేక పోయింది. ఇంత అందగత్తె కనుకనే ఆయన్ను తేలిగ్గా వల్లో వేసుకొంది. ఆడవాళ్ళకే ఇలా ఉంటే. మగవాళ్ళకు ఇంకెలా ఉండాలి అనుకొంది.

"లోపలికి రా అక్కా" అంటూ ఎంతో చనువుగా వసుంధరచేయి పట్టుకొంది.

'ఛీ... దరిద్రపుముండ, వరుసకలుపుతోంది. విడిచింది వీధికి పెద్ద అన్నారు. దీనికి సిగ్గేమిటి! అనుకొన్నవాళ్ళు సిగ్గుపడాలిగాని' మనసులో తిట్టుకొంటూనే ఆమెను అనుసరించింది. ప్రక్కన రాజారావు ఉండటంతో ఏం మాట్లాడాలన్నా ఆమెకు భయంగా ఉంది. విమల చేతి స్పర్శ కంపరమెత్తుతున్నా మౌనంగా రాజారావు వెనుకనే హాల్లోకి నడిచింది వసుంధర.

రాజారావు హాల్లో కుడివైపు గది కర్టెన్ తొలగించి "అదుగో సమ్మా మీ ఆయన. వెళ్ళి మాట్లాడు" అన్నాడు. ఆ దృశ్యాన్ని చూసి కెవ్వున అరచింది వసుంధర. సత్యనారాయణ మంచంమీద కూర్చొని ఉన్న కుష్టువ్యాధిగ్రస్తురాలికి గ్లాసుతో మందు త్రాగిస్తున్నాడు. కుష్టువ్యాధిగ్రస్తురాలు శరీరమంతా కురుపులతో అసహ్యంగా ఉంది. సత్యనారాయణ మందు త్రాగించడం పూర్తి చేసి, ఆమెకు సమీపంలో ఉన్న కుర్చీలో కూర్చొన్నాడు.

"ఏమండీ! దూరంగా వచ్చేయండి. మనం పిల్లలుగలవాళ్ళమండీ. అది మనకు అంటుకొంటుందండీ" బిగ్గరగా అంది వసుంధర అన్నీ మరచిపోయి.

ఆమె వెనకవైపు దిండ్లొకసారి సరిచేసి కూర్చోబెట్టి, "ఇదే మీ అమ్మాయితే ఆ మాట అనగలవా" అన్నాడు సత్యనారాయణ భార్యవైపు నవ్వుతూ చూస్తూ.

"మా అమ్మా! ఆమెకు ఇలాంటి ఖర్మ ఎందుకుపడుతుంది" కంగారుగా అంది వసుంధర.

"అవును, ఈమె మీ అమ్మ! విమల నీ చెల్లెలు."

"ఏమిటండీ మీరు మాట్లాడేది. ఈమె నా అమ్మ ఎలా అవుతుంది. నా కాపురంలో నిప్పులు చల్లిన ఇది నాకు చెల్లెలా" కోపం పెల్లుబికగా అరచింది.

"అవును. ముమ్మాటికీ."

వసుంధర కుష్టువ్యాధిగ్రస్తురాలు వైపు, విమలవైపు మార్చి మార్చి చూసింది. కుష్టువ్యాధిగ్రస్తురాలు తల తిప్పుకొంది. విమల కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఏడుపును ఎంతో నిగ్రహంతో నొక్కిపట్టినట్లు ఆమె మెడదగ్గర నరాలు తెలియజేస్తున్నాయి. మాటిమాటికీ వసుంధర వైపు చూస్తూ పిలిస్తే వళ్ళో వాలిపోవాలన్నంత ఆదుర్దాగా ఉంది. మౌనంగా చూస్తున్నాడు రాజారావు.

సత్యనారాయణ చెప్పుకుపోతున్నాడు. "విమల మా స్కూల్లో హిందీటీచరుగా చేరింది. ఆమె అందమైన ముఖంలో ఎప్పుడూ చీకటినీడలు తారట్లాడుతూ ఉండేవి. ఇంత లేత వయసులో ఈమెకు ఎన్ని కష్టాలు అనుకొన్నాను. ఆమెను ఓదార్చాలనాను ఆమెకు దగ్గరయ్యాను. పరిచయం పెంపొందింది. పర్యవసానంగా ఆమె తన కుటుంబ సమస్యలు నాతో చర్చించింది. నేను ఆశ్చర్యపోయాను. కారణం ఆ సమస్యలు నాకు ముడిపడి ఉండటమే. వసుంధర తల్లి, వసుంధర పదేళ్ళ ప్రాయంలో ఒక నీచుని మోసానికి గురై కాపురాన్ని కాలదన్ని వెళ్ళిపోయింది. తరువాత ఆ నీచుడి వలన ఆమెకు విమల పుట్టింది. విమల పుట్టిన కొంతకాలానికి ఆ దుర్మార్గుడు

వసుంధర తల్లిని వదలి ఎటో వెళ్ళి పోయాడు. ఆ పరిస్థితుల్లో బిడ్డను ఎన్నో కష్టాలుపడి చదివించింది. కాని దేవుడు ఆమె మీద కనికరం లేకుండా కుష్ఠు వ్యాధిని ప్రాప్తింపజేసాడు. ఇదీ విమల వెనుక చరిత్ర. ఎలాగో ఉద్యోగం దొరికిందన్న ఆనందమేగాని, అప్పులు లేక తన కష్టాల్ని కన్నీరుగా చేసుకొని విలపిస్తూ ఉంది. ఈ విషయం వెంటనే వసుంధరకు తెలియజేయాలనుకొన్నాను. కాని ఆమె తల్లి ఒప్పుకోలేదు. తన పెద్దకూతురు ఎడల ఎంతో ద్రోహం చేసిందని, ఇప్పుడు తనను చూస్తే ఆమె అసహ్యించుకొంటుందని భయపడింది. తను చనిపోయేముందు ఒకసారిగా చూస్తే చాలు అంది. విమలకూడా అక్కతో చెప్పవద్దు అంది. కారణం మీరుపిల్లా, పాపగలవారు అమ్మని చూసి అక్కయ్య ఇంటికి తీసుకొనిపోవచ్చు. పిల్లలు భయపడతారు. అదీగాక వాళ్ళ ఆరోగ్య దృష్ట్యాకూడా ఇది మంచిది కాదు అంది. అందువలన నేను నా భార్యకు నిజం చెప్పలేక, ఇటు విమలను ఒంటరిగా వదలలేక రోజూ సాయంత్రం వచ్చి మా అత్తగారిని చూసి కబుర్లు చెప్పి పోతూ కాలంగడుపుతున్నాను. అంతేగాక రాజారావుగారికి కూడా ఈ విషయం తెలియనివ్వలేదు. ఇప్పుడు చెప్పండి, నేనుచేసింది తప్పంటారా?" ప్రశ్నించాడు సత్యనారాయణ.

వసుంధర గుండెల్లోంచి ఉవ్వెత్తున తన్నుకువచ్చిన దుఃఖం కట్టలుతెంచుకొని ప్రవహించింది. ఒక్క ఉదుటున వెళ్ళి అమ్మా అంటూతల్లిని కౌగలించుకొంది. అప్పుడు ఆమెకు కుష్ఠువ్యాధిగాని దాని తీవ్ర పరిణామం గాని ఆమెకు అర్థం కాలేదు. ఎంతో బలవంతంమీద వసుంధరను ప్రక్కనున్న కుర్చీలో కూర్చోపెట్టగలిగాడు సత్యనారాయణ. విమల "అక్కా" అంటూ వచ్చి నేలమీద కూర్చొని అక్కవళ్ళో తలదాచుకొని బోరున ఏడ్చింది. ఒంటరిగా ఎన్నో ఏళ్ళు ఆమె పడ్డ కష్టాలకు ఫలితంగా ఇప్పుడు తనవాళ్ళంటూ కొంతమంది ఆప్తులు బంధువులు దొరికారు. అందుకే ఆమెకు అంత దుఃఖం. వసుంధర తన ఒడిలో ఉన్న చెల్లెలు తలను ప్రేమగా నిమురుతోంది. ఆమెకు ఈ లోకంలో ప్రియమైన వస్తువేదో దొరికినట్లుంది.

"తల్లీ, నన్ను క్షమిస్తావు కదూ! నేను నీకు ఒకప్పుడు చేసిన ద్రోహానికి ఈనాడు ఫలితం అనుభవిస్తున్నాను" పశ్చాత్తాప హృదయంతో అంది వసుంధరతల్లి రాజమ్మ.

"అమ్మా! అలా అనకమ్మా. ఎంతో కాలానికి కలుసుకొన్నాం. నా కెంతో ఆనందంగా ఉంది. ఇక ఈ జబ్బు అంటావా అది మన అందరి దురదృష్టం. అంతమాత్రంచేత నిన్ను వదులు కొంటామా" అంటూ అంతవరకు తననే

గమనిస్తున్న భర్తను చూసేసరికి ఆమె హృదయం ద్రవించిపోయింది.

తనలో మొలకెత్తిన అనుమానం, తద్వారా బావిలో దూకడంవంటి నీచ కార్యం చేయడం గుర్తుకొచ్చి చెల్లెల్ని విడిపించుకొని లేచి భర్తకాళ్ళదగ్గర వంగి పాదాలను కళ్ళకద్దుకొంది.

"ఛ.... ఛలే వసుంధరా. ఏమిటిది." అంటూ ఆమెను ఆప్యాయంగా లేవ నెత్తాడు సత్యనారాయణ.

"నన్ను క్షమించండి. మీమీద లేని పోని అనుమానాలు పెట్టుకొని మిమ్మల్ని అవమానించాను. దేవుడులాంటి మీరే నన్ను వివాహం చేసుకొని ఉండకపోతే ఈ స్థితిలో ఉండేదానినా" అంది కృతజ్ఞతాపూర్వకంగా,

తనను పెళ్ళి చేసుకొవడానికి ఎవరూ ముందుకు రాకపోవడం, సత్యనారాయణ చేసుకోవడం అన్నీ చెప్పడం మొదలు పెట్టింది తల్లికి.

"ఇంకేం చెప్పకు తల్లీ. అబ్బాయి ద్వారా మన కుటుంబ విషయాలన్నీ తెలుసుకొన్నాను" అంది ఆమె కూతురి వైపు ప్రేమగా చూస్తూ.

"చెల్లెమ్మా పిల్లలు స్కూలునుంచి వచ్చేటయిమయింది. నీవు కనిపించక పోతే కంగారుపడుతుంటారు" అన్నాడు రాజారావు రంగంలోకి దిగి.

"నిజమే అన్నయ్యా.అమ్మా నీ ఇద్దరు మనవళ్ళను, మనవరాల్ని తీసుకొని వస్తాను చూద్దువుగాని. నువ్వూ రా విమలా."

"ఇప్పుడొద్దులే అక్కా. అమ్మ దగ్గర ఉంటాను. బావ ద్వారా నేను అశోక్‌ను, మురళిని, జయను ఎప్పుడో చూసాను. నిన్నుకూడ. కాని నే నెవరైంది ఎవరికీ తెలియదనుకో" నవ్వుతూ అంది విమల.

సత్యనారాయణను అక్కడే ఉండమని రాజారావు, వసుంధర ఇంటికి బయలు దేరారు.

"ఏయ్ రిక్షాఅబ్బీ ఇలా రా" రిక్షా పిలు స్తున్నాడు రాజారావు

"వద్దు అన్నయ్యా.నా కిప్పుడు ఒంట్లో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. నడిచే వెళ్దాం" అంది వసుంధర.

ఇద్దరూ నడవడం మొదలుపెట్టారు. దారిలో కాలువమీద కట్టిన వంతెనను సమీపించారు. వంతెనకు సమీపంలో కాలువగట్టుమీద కాకులు గుంపుగా చేరి అరుస్తున్నాయి.

"ఎందుకు కాకులు అలా అరు స్తున్నాయో చెప్పగలవా వసుంధరా!"

"అక్కడేదో వింత విషయం జరిగుంటుంది అన్నయ్యా!"

"సరే చూస్తాం రా" అంటూ వాటిని సమీపించి తరిమాడు. అవి ఎగిరి పోయాయి.

"ఇప్పుడేం కనిపించిదమ్మా నీకు."

"ఏమీ కనిపించలేదు."

"అంతేనమ్మా. లోకమూ అంతే. అందుకే లోకులు పలుగాకులు అన్నారు. లేని విషయాన్ని సృష్టించి దాన్ని పెద్దది చేస్తారు. చివరకు నిజం తరచి చూస్తే అక్కడ ఏమీ ఉండదు. అదే నీ విషయంలోనూ జరిగింది. సత్యవతి, పార్వతమ్మలాంటివాళ్ళు చేసిన ప్రచారం నీ మనసును విషతుల్యం చేసింది. అది ఈ సంఘంలో మనుషుల నైజం తల్లీ."

"నిజం అన్నయ్యా."

"అందుకే ఇప్పుడు మీ అమ్మను తీసుకొచ్చి నీ ఇంట్లో పెట్టుకొంటే ఇదే లోకం నిన్ను దుమ్మెత్తిపోస్తుంది" అన్నాడు రాజారావు ఉడికిస్తూ.

"హు....నన్ను తొమ్మిది నెలలు మోసి, అష్టకష్టాలు పడి నన్ను కన్నది ఈ లోకం కాదు. మా అమ్మ. మా అమ్మ కోసం ఈ లోకాన్ని లెక్కచేయాల్సిన అవసరం లేదు. రేపే నా చెల్లెల్ని, మా అమ్మను తీసుకొచ్చి మా దగ్గరే పెట్టుకొంటాం" అంది రోషంగా.

"అదీ మనిషికి ఆ మాత్రం ధైర్యం ఉండాలమ్మా. లేకపోతే ఈ లోకంలో బ్రతకలేం."

రాజారావు మనసిప్పుడు నిర్మలంగా ఉంది. కాకు లరిస్తే అరిష్టం అని అన్నాడొక విద్యార్థి. కాని ఇప్పుడు అరిష్టం కాదుగదా, ఒక సమస్యకు పరిష్కారం దొరికింది అనుకొన్నాడు. కాలువ ఇవతలి గట్టున లేచిపోయిన కాకులు మరల అవతలి గట్టున గుంపుగా చేరి అరుస్తున్నాయి.